క్లుప్తంగా

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోఎస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నట్టు ఆలయ కార్య నిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి, సుప్రభాతం చదివి వినిపించి, అనంతరం స్వామికి అభిషేకాలు చేయనున్నట్టు చెప్పారు. 7.30గంటలకు బాలభోగం, 9.30గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30గంటలకు రాజభోగనివేదన ఉంటాయని, మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు. సాయంత్రం 6.30గంటలకు నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి ఇవ్వనున్నట్టు ఈవో చెప్పారు.

ఐదో పట్టణ సీఐగా చంద్రశేఖర్



మద్రిపాలెం: ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్ సీఐగా వి.చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.1998 బ్యాచ్‌కు చెందిన ఆయన 2010లో సీఐగా పదోన్నతి పొంది కొత్తవలస,విజయనగరం,పలాస,రణస్థలం, విశాఖ వన్‌టౌన్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం రేంజ్ వీఆర్ నుంచి కంచరపాలెం స్టేషన్‌కు శాంతి భద్రతల సీఐగా బదిలీపై వచ్చారు.అంతకు ముందు స్టేషన్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి, పెండింగ్ కేసులపై ఆరా తీశారు.

రైతుబజారులో 65 స్టాళ్లకు డ్రా



డ్రా తీసిన టోకెన్ ఇస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులో శుక్రవారం 65 స్టాళ్లకు డ్రా తీశారు. ఉదయం 85 మందికి, సాయంత్రం 57 మంది రైతులకు దుకాణాలు కేటాయించారు. స్టాళ్లకు డ్రా తీసి రైతులకు రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టేట్ అధికారి మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతివారం స్టాళ్లకు సంబంధించి డ్రా తీస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయకుడు సతీష్,రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

మురళీనగర్: స్థానిక వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేకే కార్డియా అండ్ ఆకాష్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఇంప్లాంటేషన్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, పి.చెల్వరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో ఉచిత గుండె వైద్య పరీక్షలు, ఈసీజీ, లిపిడ్ ప్రొఫైల్, హెచ్‌బీఏ1సి, ఎఫ్‌బీఎస్, బీపీ పరీక్షలతోపాటు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ శిబిరంలో ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ పిల్లా మనోహర్, దంత వైద్యనిపుణుడు డాక్టర్ పి.ఆకాష్ పాల్గొంటారని చెప్పారు. మురళీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

1 నుంచి డిజిటల్ సర్టిఫికెట్లు అందజేయాలి

మద్రిపాలెం: విశాఖపట్నం పోర్టు,కార్గో హ్యాండిలింగ్ పెన్షనర్లు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల కోసం వచ్చేనెల 1 నుంచి 15 వరకు విశాఖపట్నం పోర్టు అథారిటీ పరిపాలనా విభాగంలో ఉన్న సాంబమూర్తి ఆడిటోరియంలో ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా డిజిటల్ సర్టిఫికెట్లను అందజేయాలని హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు,బ్యాంక్ అకౌంట్,ఫోన్ నంబర్,పీపీవో నంబర్ కలిగిన పుస్తకాన్ని తీసుకువెళ్లాలని ఆయన తెలిపారు.డిజిటల్ సర్టిఫికెట్లు చేసుకోని వారికి పింఛన్ నిలిపేస్తారని పేర్కొన్నారు.

నిర్లక్ష్యపు చీకటి - వెలుగులు



జంక్షన్‌లో వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు



ఆలయానికి వెళ్లే దారిలో పగలు వెలుగుతున్న వీధి దీపాలు



మాధవస్వామి ఆలయం రోడ్డులో వెలుగుతున్న వీధి దీపం

- అధికారుల తీరుతో అవస్థలు పడుతున్న జనం
- విలువైన విద్యుత్ వృథా

మద్రిపాలెం: విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపంతో ఒక వైపు విలువైన విద్యుత్ వృథా అవడంతో పాటు మరో వైపు వీధి దీపాలు వెలగక చిమ్మచీకట్లు అలుముకుంటున్నాయి. దీంతో ప్రజలు నానా అవస్థలు పడవలసి వస్తోంది. విద్యుత్ దీపాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. కొన్ని సార్లు పగలురాత్రీ అనే తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతుండగా, తరచూ రాత్రుళ్లు కూడా దీపాలు వెలగకపోవడంతో అంధకారం రాజ్యమేలుతోంది. వీధి దీపాల నిర్వహణలో ఉన్న సమస్యలను విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. జీవీఎంసీ 51వ వార్డు మాధవధార, మాధవస్వామి ఆలయానికి వెళ్లే మార్గం, జంక్షన్‌లో హైమాస్ట్ లైట్లు, వరుసగా సుమారు 10 వీధి దీపాలు ఉన్నాయి. కొంతకాలంగా పగలు, రాత్రీ తేడాలేకుండా ఇవి వెలుగు తుండడంతో విద్యుత్ వృథా అవుతోంది.

అస్తవ్యస్తంగా నిర్వహణ

మాధవధార ఆలయానికి వెళ్లే ప్రాంతమంతా మామిడి చెట్లతో నిండి నిర్మానుష్యంగా ఉంటుంది.ఆలయానికి వెళ్లే భక్తులు, ధారకు వెళ్లేవారు, అర్చకులు,ఉదయం,సాయంత్రం వాకింగ్ చేసే వారు తప్ప ఆ ప్రాంతంలో పెద్దగా జనసంచారం ఉండదు. ఆకతాయిలు, గంజాయి, మద్యం సేవించే వారు దీన్ని అదునుగా తీసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇటీవల మాధవస్వామి ఆలయంలో దొంగతనం జరిగిన సంగతి తెలిసిందే. పట్టపగలు కూడా ఈ బ్యాచ్‌లు రెచ్చి పోతున్నాయని కొందరు వాపోతున్నారు. అయితే ఈ ప్రాంతంలో రాత్రి పూట కొన్ని వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రివేళ దీపాలు వెలగకపోవడం, పగలు వెలుగుతూ ఉండడం చూస్తుంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో, నిర్వహణ ఎంత అస్తవ్యస్తంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. అధికారులు విద్యుత్ పొదుపుపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పగలు వీధి దీపాలు వెలగకుండా చూడాలని, రాత్రి వేళ అన్ని దీపాలు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

ధార దారిలో చిమ్మ చీకట్లు

మాధవధారకు వెళ్లే దారిలో రాత్రి వేళ వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో చిమ్మచీకట్లు అలుముకుంటున్నాయి. నిత్యం ఇక్కడ ఆకతాయిలు సంచరిస్తుండడంతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లైట్లు సరిగా వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

– స్వామి, మాధవధార

విద్యుత్ వృథాను అరికట్టాలి

నిత్యం వీధి దీపాలు వెలుగుతుండడంతో ఎంతో విలువైన విద్యుత్ వృథా అవుతోంది. అధికారులు తక్షణం స్పందించి సక్రమంగా వీధి దీపాలను నిర్వహించి, వృథాను అరికట్టాలి.

– రాంబాబు, మాధవధార

నేడు వైభవ వెంకన్న ఆలయంలో వైఎస్సార్‌సీపీ ప్రత్యేక పూజలు



వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కేకే రాజు

సీతమ్మధార: చంద్రబాబునాయుడు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఉదయం 8 గంటలకు ఉత్తర నియోజకవర్గంలోని 49వ వార్డు ఎన్‌జీజీవోఎస్ కాలనీలో గల వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయ కర్త కేకేరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు.నాయకులు, కార్యకర్తలు,కార్పొరేటర్లు , పార్టీ శ్రేణులు హాజరుకావాలని పార్టీ వర్గాలు కోరాయి.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి





మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి, పాల్గొన్న విద్యార్థులు

సీతమ్మధార: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. ప్రిజం కాలేజీని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోకూడదని చెప్పారు. విద్యతోనే ఉన్నతమైన జీవితం సాధ్యమవుతుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఏర్పర్చుకోవాలని సూచించారు. కచ్చితంగా ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. యువత అత్యంత వేగంగా బైక్‌లు నడుపుతూ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని, రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా 20 ఏళ్లలోపు వారే మరణిస్తున్నారని తెలిపారు. సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కొంత మంది నేరగాళ్లు కొరియర్, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరిట ప్రజలను దోచుకుంటున్నారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ తెలియజేయకూడదని తెలిపారు. ప్రిజం డిగ్రీ, పీజీ కాలేజీ కార్యదర్శి, కరస్పాండెంట్ సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యా రాజగోపాల్, డాక్టర్ అనిరుధ్ కోవిల్లి, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

నగరానికి ఈశాన్య ట్రైనీ పోలీసులు

విశాఖ సిటీ: నార్త్ ఈస్ట్ పోలీస్ అకాడమీ (నెపా) నుంచి ఐదుగురు ట్రైనీ డీఎస్పీలు, 10 మంది ట్రైనీ ఎస్‌ఐలు అధ్యయన పర్యటన (భారత్ దర్శన్) నిమిత్తం విశాఖకు వచ్చారు. ఈ నెల 29వ తేదీ వరకు పోలీస్ విభాగానికి చెందిన పోలీస్ కంట్రోల్ రూమ్, 3వ పట్టణ పోలీస్‌స్టేషన్, ఫింగర్ ప్రింగ్ బ్యూరోతో పాటు నగరంలో పలు అధ్యయన కేంద్రాలు, చారిత్రాత్మక, పురావస్తు ప్రదేశాలను సందర్శించనున్నారు. శుక్రవారం వీరిని బీచ్ రోడ్డులో ఉన్న పోలీస్ ఆఫీసర్ మెస్‌లో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి కలిశారు. వీరితో సమావేశం నిర్వహించి పలు అనుభవాలను పంచుకున్నారు. మెళకువలను వివరించారు. దేశ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన విధులపై అవగాహన కల్పించారు.

భారీ వర్షంతో ఇక్కట్లు



నరసింహనగర్ రైతుబజార్‌లోకి చేరిన నీరు



శ్రీనగర్ రోడ్‌లో ప్రవహిస్తున్న వర్షపు నీరు



రైతుబజార్‌లో ఉసూరు మంటున్న రైతులు

సీతంపేట: వాయుగుండం ప్రభావంతో శుక్రవారం కూడా ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. కాలు బయటపెట్టే వీలు లేకుండా రోజంతా వర్షం కురవడంతో జనం అవస్థల పాలయ్యారు. భారీ వర్షం కారణంగా బజార్లు బోసిపోయాయి. కొనేవారు లేక సీతంపేట, అక్కయ్యపాలెం బజార్లు, నరసింహనగర్ రైతు బజార్ వెలవెలబోయాయి. భారీ వర్షం కారణంగా వ్యాపారాలు సాగక చిరువ్యాపారులు, తోపుడుబళ్ల వ్యాపారులు ఉసూరుమన్నారు. ముసురు కారణంగా మూడు రోజులుగా బేరాలు లేక తెచ్చిన సరుకు పాడైపోతోందని తోపుడుబళ్ల వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏకధాటిగా కురిసిన వర్షానికి శ్రీనగర్, అక్కయ్యపాలెం, శంకరమఠం ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సీతంపేట: పెందుర్తి సాధుమఠం పక్కన గల మహా కామేశ్వరి పీఠంలో వచ్చే నెల 3వ తేదీ నుంచి 13వ తేదీవరకు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు పీఠం ఉత్తర పీఠాధిపతి మహాశక్తి దేవి తెలిపారు. మధురానగర్‌లో గల పీఠం కార్యాలయ ప్రాంగణంలో ఉత్సవాల కరపత్రాలను ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యశాస్త్రి మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కనకధారా మహా యజ్ఞం, చండీ యాగం, కాలసర్పదోష నివారణ పూజ, నాగశాంతి మహాయజ్ఞం జరుగుతుందన్నారు. అలాగే 4వతేదీన బాలోపాసన, 6న అమ్మవారికి హరిద్రార్చన, 7న సరస్వతి పూజ, 9న సువాసిని పూజ, 13న శ్రీభూ నీలా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్,పీఠం ప్రతినిధులు వి.రాజి, ఎ.లక్ష్మి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయండి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ సభ్యులు

మద్రిపాలెం: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల సమాఖ్య (ఏపీటీఎఫ్) ఆవిర్భవించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వచ్చేనెల 6,7,8 తేదీల్లో విజయనగరంలో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హృదయరాజు కోరారు. 50వ వార్డు బిర్లా జంక్షన్ సమీపంలో ఓ హోటల్‌లో శుక్రవారం మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ఆవిర్భవించి 80 ఏళ్లు అయిన సందర్భంగా ఓక్ జూబ్లీ వేడుకలు, 20వ రాష్ట్ర విద్యా,వైజ్ఞానిక మహాసభలు విజయనగరంలో ఫూల్‌బాగ్‌లో ఉన్న జె-కన్వెన్షన్ మార్పు బాలకృష్ణమ్మ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.ఈ మహా సభల్లో విద్యావేత్తలు,మేధావులు పాల్గొంటారన్నారు. విద్యా ప్రగతి,ఉపాధ్యాయుల సంక్షేమం,సమాజ శ్రేయస్సు,మహిళా సాధికారత, పెన్షన్లు,నూతన విద్యా విధానం, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరును చర్చించి తీర్మానాలు చేయనున్నట్టు చెప్పారు.ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎ.ఎస్.నాయుడు మాట్లాడుతూ విశాఖ జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ధనుంజయరావు,జాకబ్ సేవియర్,అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వీరభద్రరావు,నాయకులు జోజిబాబు, పట్నాయక్, కృష్ణారావు, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.జానకీరామ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాంతి ఆశ్రమం స్థలాన్ని కాపాడండి

సీతంపేట: కబ్జాకుగురైన, నగరంలోని శాంతి ఆశ్రమం స్థలాన్ని తిరిగి ఆశ్రమానికి అప్పగించాలని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ కోరారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత యోగా తరగతు ల నిర్వహణకు 6.24 ఎకరాల స్థలాన్ని కండిషనల్ గిఫ్ట్‌గా వివేకానంద అనే వ్యక్తికి శాంతి ఆశ్రమం ఇచ్చిందన్నారు.ఆ స్థలాన్నివలు వ్యాపార కార్యకలాపాలకు అద్దెకు ఇచ్చారని తెలిపారు. ఈ నెల 30వ తేదీ లోగా స్థలాన్ని శాంతి ఆశ్రమానికి అప్పగించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు చొరవ తీసుకుని కబ్జాకు గురైన స్థలం శాంతి ఆశ్రమానికి అప్పగించాలని కోరారు. కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, నరసింహరాజు, సాయిబాబా, ఎం.ఎస్.ఆదిత్య, వినమ్ర పాల్గొన్నారు.

వి.బి.వి.రెడ్డికి ఘన నివాళి



వి.బి.వి. రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కె.సి.రెడ్డి, అజయ్ కల్లాం, మధుకుమార్ తదితరులు



రక్తదానం చేస్తున్న విద్యార్థులతో బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల పూర్వ అధ్యక్షులు వి.బి.వి.రెడ్డి శత జయంతిని కళాశాల యాజమాన్యం, సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో కళాశాల సొసైటీ అధ్యక్షులు ప్రొఫెసర్ కె.సి.రెడ్డి, సెక్రటరీ, కరస్పాండెంట్ జి.మధుకుమార్, విశ్రాంత ఐఏఎస్ అధికారి సి.ఆంజనేయరెడ్డి, ఉమ్మడి ఆంధ్ర పూర్వ చీఫ్ సెక్రటరీ అజయ్ కల్లాం, విశ్రాంత ఏయూ రెక్టార్ ఎ.ప్రసన్నకుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని వి.బి.వి.రెడ్డి చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి వి.బి.వి.రెడ్డి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన గొప్ప వ్యాపారవేత్తగా గుర్తింపు పొందడమే కాక, పేద కుటుంబాల నుంచి వచ్చిన ప్రతిభావంతుల పిల్లలకు స్కాలర్‌షిప్పులద్వారా ఆర్థిక సాయం అందించారని తెలిపారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల పూర్వ అధ్యక్షుడు వి.బి.వి.రెడ్డి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. కళాశాల సెక్రటరీ,కరస్పాండెంట్ జి.మధుకుమార్ ముఖ్యఅతిథిగా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడమంటే ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడటమేనని తెలిపారు. వి.బి.వి. రెడ్డి జయంతి రోజున రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవ రాట



ఉత్సవ రాట కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు కళింగనగర్ జంక్షన్ వద్ద గల వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాల రాట కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కరిమిరెడ్డి శ్యామ్, వినోద్, కె.వరహాలరాజు, ఆటో డ్రైవర్లు, యజమానులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం పరిధి దుర్గానగర్‌లో దుర్గమాంబ అమ్మవారి ఆలయంలో శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాభిషేకం జరిపారు. ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలి



వామనమూర్తిని సత్కరిస్తున్న ఆటోస్టాండ్ సభ్యులు

తాటిచెట్లపాలెం: పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం రైల్వేస్టేషన్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా ఇటీవల బెంగళూరులో జరిగిన ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ 18వ జాతీయ మహాసభల్లో జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన వామనమూర్తిని రైల్వేస్టేషన్ వద్ద గల ఆటోస్టాండ్ కార్మికుల ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా రంగంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అధిక భారం వేస్తున్నాయని చెప్పారు. పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలో తీసుకురావాలని, డ్రైవర్లకు సామాజిక భద్రత కల్పిస్తూ వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీలను అమలుచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆటోస్టాండ్ అధ్యక్షుడు ఎస్.చెన్నారెడ్డి, హెచ్ ఎ ఖాన్, లండ అప్పారావు, వై.వెంకట్, జి.గణేష్ కుమార్, రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పెన్షనర్ల సంఘం భవనం

- అవస్థలు పడుతున్న వృద్ధులు



శిథిలావస్థకు చేరుకున్న పెన్షనర్ల సంఘం భవనం

సీతమ్మధార : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గల పెన్షనర్ల సంఘం భవనం శిథిలావస్థకు చేరుకుని బూత్‌బంగ్లాను తలపిస్తోంది. 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనానికి కనీస మరమ్మతులు చేయకపోవడంతో ఎప్పుడు కూలిపోతుందోనని పెన్షనర్లు భయాందోళన చెందుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గల ఖజానా కార్యాలయానికి లైఫ్ సర్టిఫికెట్లు, పెన్షన్ సొమ్ములో హెచ్చుతగ్గులు, బకాయిల సమస్యల పరిష్కారం వంటి పలు పనులతో పాటు, ప్రతినెలా ఒకటవ తేదీ నుంచి ఏడో తేదీ వరకు అధికసంఖ్యలో పెన్షనర్లు ఇక్కడకి వస్తారు. పెన్షనర్ల సంఘం భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కనీసం కూర్చొనేందుకు స్థలం లేక వృద్ధులు అవస్థలు పడుతున్నారు. వారు చెట్ల కింద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ భవనంలో కొన్ని సంవత్సరాల పాటు గీతా సత్సంగాన్ని నిర్వహించారు. ఇప్పుడు భవనం పూర్తిగా నిరుపయోగంగా ఉండడంతో రాత్రిపూట ఆకతాయిలు పలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని చుట్టుపక్కల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ భవనానికి మరమ్మతులు నిర్వహించాలని పెన్షనర్లు కోరుతున్నారు.

జోరుగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు



సీతమ్మధారలో విద్యుత్ స్తంభానికి బిగించిన స్మార్ట్ మీటర్

సీతమ్మధార: విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలో స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియ ఊపందుకుంది. విద్యుత్ వినియోగదారుల కనెక్షన్లకు సంబంధించి స్మార్ట్ మీటర్లు అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. గుజరాత్ రాష్ట్రం నుంచి దిగుమతి చేసుకున్న స్మార్ట్ మీటర్లను అదానీ కంపెనీ ప్రతినిధులు ముందుగా ప్రభుత్వ సర్వీసులకు బిగిస్తున్నారు. పైలెట్‌ప్రాజెక్టులో భాగంగా ఆశీలమెట్ట, విశాలాక్షి నగర్ ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా సీతమ్మధార సెక్షన్ ఈపీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజినీర్ సుధాకర్ 'సాక్షి'తో మాట్లాడుతూ తమ సబ్ డివిజన్ సెక్షన్ పరిధిలోని సీతమ్మధార, మద్దిలపాలెం, హెచ్‌బీ కాలనీ ప్రాంతాల్లో ఇప్పటివరకు సుమారు 260 స్మార్ట్‌మీటర్లను బిగించినట్టు తెలిపారు. వినియోగదారులు ప్రీపెయిడ్ విధానంలో మొబైల్ ఫోన్ల మాదిరిగానే రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. లేనిపక్షంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన చెప్పారు. సీతమ్మధార ప్రాంతంలోని విద్యుత్‌స్తంభాలకు అదానీ కంపెనీ సిబ్బంది స్మార్ట్ మీటర్లు బిగించారు. తరువాతి దశలో కమర్షియల్ కనెక్షన్లకు కూడా స్మార్ట్ మీటర్లు బిగిస్తారు.